క్లుప్తంగా

వెంకన్నకు పంచామృతాభిషేకాలు



వైకుంఠ వేంకటేశ్వరునికి పంచామృతాలతో అభిషేకం చేస్తున్న అర్చకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబేకాలనీలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి వారికి సోమవారం పంచామృతాభిషేకాలు చేశారు. స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అభిషేకాలు చేశారు.

26న జిల్లా స్థాయి యోగాసన పోటీలు

అగనంపూడి: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా స్థాయి యోగాసన పోటీలు ఈనెల 26న పరవాడ మండలం వెన్నెలపాలెంలోని కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.రవిశంకర్, సీహెచ్.ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు బి.అన్నాజీరావు తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించనున్న ఈ పోటీల్లో అర్హత సాధించిన వారు రాష్ట్రా స్థాయి పోటీల్లో పాల్గొనున్నారని వారు తెలిపారు. వివరాల కోసం 97016 58665, 78010 83283 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వైభవంగా శ్రీవారి శాంతి కల్యాణం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో సోమవారం లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కల్యాణాన్ని తిలకించి భక్తులు పులకించి పోయారు.

దోషులను కఠినంగా శిక్షించాల్సిందే..

కోల్‌కతా ఘటనపై నిరసన జ్వాల



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



ప్లకార్డులతో నిరసన చేపడుతున్న ప్రజా సంఘాల నేతలు

అగనంపూడి: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన దుండగులకు ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ కూర్మన్నపాలెం కూడలిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బొండా చారిటబుల్ ట్రస్ట్, జీఎస్ఎల్ వీకర్స్ ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో బొండా శ్రీదేవి మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు రోహిణి, బి.ఎం.ఎస్.నాయుడు, ఎ.వి.రమణారావు, బలిరెడ్డి సత్యనారాయణ, గొన్నా రమాదేవి, జయలక్ష్మి, జయ, ఇందిర, దినేష్, లావణ్య, ఈగలపాటి యువశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యూత్ సారథ్యంలో... వడ్లపూడి అప్పికొండకాలనీ అంబేడ్కర్ యూత్‌సారథ్యంలో రామకృష్ణ ఇంగ్లిష్ మీడియం పాఠశాల కూడలి వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని నినదించారు.

పాతగాజువాకలో మానవహారం

గాజువాక:కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గాజువాకలో జనసేన నాయకులు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఆ పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు ఆధ్వర్యంలో పాతగాజువాక జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గడసాల అప్పారావు, గంధం వెంకటరావు, లంకల మురళీదేవి, పాలరౌతు వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



అప్పికొండ కాలనీ అంబేడ్కర్ యూత్ సారథ్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న యువత

ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని వినతి

గాజువాక: అగనంపూడి నుంచి షీలానగర్ వరకు జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని కోరుతూ పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు ట్రస్టు చైర్మన్ పల్లా కార్తీక్ ఆధ్వర్యంలో సభ్యులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. భారీ వాహనాలు తిరగుతుండడంతో ఇటీవల ప్రమాదాలు జరిగి 15 మంది మృతి చెందారని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సభ్యులు బలిరెడ్డి నాగేశ్వరరావు, అన్నపూర్ణ, సతీష్‌కుమార్, కె.గోవింద, సీహెచ్.రమణ తదితరులున్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

బోర్డు తొలగించాలి

గాజువాక: పాతగాజువాక జంక్షన్‌లోని గాంధీ విగ్రహానికి ఎదురుగా ట్రాఫిక్ స్టిక్కర్లతో ఏర్పాటు చేసిన బోర్డు తొలగించాలని కోరుతూ మహాత్మా, మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్టు సభ్యులు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ సన్యాసినాయుడుకు వినతి పత్రం అందజేశారు. విగ్రహం ఎదురుగా బోర్డును ఏర్పాటు చేయడంవల్ల విగ్రహం ఎవరికీ కనిపించడం లేదని పేర్కొన్నారు.విగ్రహానికి రెయిలింగ్ ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. తమ సొంత ఖర్చులతో రెయిలింగ్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ట్రస్టు ప్రతినిధులు జాగరపు శ్రీను తదితరులున్నారు.



జెడ్సీకి వినతి పత్రం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

శాకంబరిగా కనకదుర్గమ్మ



గాజువాక: పౌర్ణమి సందర్భంగా స్థానిక డ్రైవర్స్ కాలనీలోని కనకదుర్గమ్మకు సోమవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పండ్లు, కూరగాయాలతో శాకంబరి దేవిగా సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గురు పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణలో గోవింద నామస్మరణ మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'అసలైన రైతులకు న్యాయం చేయాలి'

అక్కిరెడ్డిపాలెం: పంచవటి నిర్మాణంలో భూములు కోల్పోయిన అసలైన రైతులకు న్యాయం చేయాలని గ్రామ నాయకుడు సంగ్రాన రామారావు సోమవారం వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తికి వినతిపత్రం అందజేశారు. అక్కిరెడ్డిపాలెం సర్వే నంబర్ 12లో భూములు కోల్పోయిన రైతులకు పునరావాసం కింద ఎకరా 50 సెంట్లు కేటాయించారన్నారు. ఆ భూమి అసలైన రైతులకు కాకుండా సంబంధం లేని వ్యక్తులు అప్పట్లో అధికారులను ప్రలోభాలకు గురిచేసి స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. అవకతవకలపై విచారణ జరిపించి నిజమైన రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ బొత్సకు అభినందనలు

అగనంపూడి: ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు సత్కరించారు. ఆయన నివాసంలో సోమవారం పార్టీ జిల్లా కార్యదర్శి ప్రగడ వేణుబాబు, గాజువాక నియోజకవర్గం నాయకులు ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు, దాసరి అప్పడు, ప్రగడ రాము, బుల్లెట్ రమణ, మార్పు ధనుంజయ్, సబ్బవరపు ఈశ్వరరావు, ఎస్.పాపారావులు కలిసి అభినందించారు.



ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను సత్కరిస్తున్న 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

పోరాటాలతో ప్రభుత్వంపై ఒత్తిడి

అగనంపూడి: కార్మికులు సంఘటితంగా పోరాటం చేయడం ద్వారా మాత్రమే ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుందని ఉక్కు సీటు అధ్యక్షుడు వై.టి.దాస్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద సోమవారం చేపట్టిన 1285వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం దిగి రావాలన్నా కేవలం పోరాటలతోనే సాధ్యమన్నారు. అందులో భాగంగా ఈనెల 22న తలపెట్టిన ప్రధాన పరిపాలన భవన ముట్టడి కార్యక్రమాన్ని కార్మికులంతా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీటు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, నాయకులు వి.రామారావు, టీఎన్‌టీయూసీ నాయకులు విల్లా రామ్మోహన్‌కుమార్, గంగాధర్, డీసీహెచ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అవగాహనతో ఎయిడ్స్‌కు చెక్

అగనంపూడి: అవగాహనతో మెలిగితే హెచ్ఐవీ, ఎయిడ్స్‌కు చెక్ పెట్టవచ్చునని అగనంపూడి ప్రభుత్వ జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ అన్నారు. ఏపీఎస్ఏసీఎస్ ఆధ్వర్యంలో అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ భూతం లాంటిదని, వ్యాధి బారిన పడిన బాధితుల కుటుంబాలు పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో యాక్సెస్ట్ ప్రొగ్రాం కోఆర్డినేటర్ బి.అనిల్‌కుమార్, ప్రతినిధులు ప్రసాద్, లత, గీత, కోదండ పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అగనంపూడి జూనియర్ కళాశాల విద్యార్థులు

మైన్స్ రెన్యువల్‌పై హర్షం

గాజువాక: రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న గర్భాం లోని సరిపల్లి మైన్స్‌ను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు 2032 వరకు రెన్యువల్ చేయడంపై ప్లాంట్ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పలువురు కార్మికులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కార్మిక ప్రతినిధులు కొమ్మినేని శ్రీనివాసరావు, నమ్మి సింహాద్రి, అట్టా అప్పారావు, ధర్మాల కనకరెడ్డి తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కార్మిక ప్రతినిధులు

ఏఐటీయూసీ సమావేశాల పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక: వచ్చేనెల ఒకటి నుంచి మూడు రోజుల పాటు ఉక్కునగరంలో నిర్వహించనున్న ఏఐటీయూసీ జాతీయ సమావేశాల పోస్టర్‌ను సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఎ.జె.స్టాలిన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, కె.రాజబాబు, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్టాలిన్ తదితరులు

ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ

'సాక్షి'తో ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్



గాజువాక: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ గాజువాక జోన్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్ అన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు దోమలు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన 'సాక్షి'తో సోమవారం మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- జోన్ పరిధిలోని డ్రెయిన్లు, కాల్వల్లో మురుగునీరు సముద్రంలో కలిసిపోయే విధంగా ఔట్‌లెట్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. దీనివల్ల నీరు నిల్వ ఉండేందుకు అవకాశం ఉండదు. ఇంజినీరింగ్ విభాగం అధికారుల పాత్ర అవసరంలేనిచోట, శివారు ప్రాంతాల్లో తాత్కాలికంగా గోతులు తవ్వి నీరు వెళ్లే విధంగా చూస్తున్నాం.
- నీరు ఎక్కువగా నిల్వ ఉండిపోవడం వల్లే దోమలు అధికమవుతాయి. ఈ విషయంలో ప్రజలు కూడా సహకరించాలి. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. వారానికోరోజు డ్రైడే పాటించాలి.
- లార్వా ఆపరేషన్ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాం. గాజువాక జోన్‌లో తొలిసారిగా డ్రోన్స్ ద్వారా స్ప్రేయింగ్ చేయించాం. ఆయిల్ బాల్స్ వేయించాం. 79వ వార్డులోని చెరువులో డ్రోన్స్ స్ప్రే చేయించాం. దీన్ని భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తాం.
- డ్రైన్ డీ సిల్టేషన్ ద్వారా దోమలు లేకుండా, లార్వా అభివృద్ధి చెందకుండా చూస్తున్నాం. డోర్ టు డోర్ సర్వేలెన్స్ ద్వారా లార్వా స్ప్రే చేస్తున్నాం. పబ్లిక్ టాయిలెట్ల వద్ద మెస్‌లు కడుతున్నాం. ప్రజలకు కూడా మెస్‌లు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.
- పందుల నివారణలో కొంతవరకు సఫలీకృతమయ్యాం. గతంలో షూటర్ ద్వారా పందులను నివారణ జరిగేది. దీంతోపాటు పందుల పెంపకందారుల్లో అవగాహన పెంచడంతో పందులు కొంత వరకు తగ్గాయి. మళ్లీ ఈ మధ్య కాలంలో కొత్త పందులను తీసుకొచ్చి వదులుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిరోజు రెండు మూడు వార్డుల్లో టార్గెట్ చేసి షూటర్లతో కొట్టిస్తున్నాం.
- చెత్తను తొలగించడానికి వాహనాలను పక్కాగా ఏర్పాటు చేశాం. రోజూ ఉత్పన్నమవుతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తున్నాం. 115 క్లాప్ వాహనాలను దీనికోసం ఏర్పాటు చేశాం. వాహనాలు వెళ్లలేనిచోట మా సిబ్బంది పుష్ కార్ట్‌లతో తీసుకెళ్తున్నారు. వార్డుల్లో ఎక్కడా చెత్త ఉండిపోకుండా చూస్తున్నాం.

విశాఖ-భగత్ కి కోటి ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: పశ్చిమ మధ్య రైల్వే, జబల్‌పూర్ డివిజన్ కట్నిముర్వారా-బినా సెక్షన్ల పరిధిలో జరుగుతున్న ఆధునీకీకరణ పనుల నిమిత్త ఈ మార్గంలో నడిచే విశాఖపట్నం-భగత్ కి కోటి-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. విశాఖపట్నం-భగత్ కి కోటి (18573) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29న, భగత్ కి కోటి -విశాఖపట్నం (18574) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 31న రద్దు చేయబడింది.

31న మహిళా న్యాయవాదులకు వర్క్‌షాప్

సీతంపేట: మహిళా న్యాయవాదులకు ఈ నెల 31న వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు మహిళా న్యాయవాదుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పప్పు అనురాధ, పి.హేమమాలిని తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం విలేకరులతో వారు మాట్లాడారు. వర్క్ షాప్‌నకు ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వి.ఎస్.భానుమతి, గౌరవ అతిథిగా తెలంగాణ హైకోర్టు జడ్జి ప్రియదర్శిని, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి, విశాఖ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి రవినాథ్, విశాఖ బార్ అసోసియేషన్ ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా కోర్టు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపడుతున్నట్టు తెలిపారు. మహిళా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలపాలని కోరారు. ఈసమావేశంలో కోశాధికారి బి.రమాదేవి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాదులు అనురాధ, హేమమాలిని

24 కేజీల గంజాయి స్వాధీనం



నిందితుడితో రైల్వే పోలీసులు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న యువకుడ్ని రైల్వే పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గవర్నమెంట్ రైల్వే పోలీసు (జీఆర్పీ), రైల్వే భద్రతా దళం(ఆర్పీయఫ్) ఉన్నతాధికారులు ఆదేశాలతో ఆర్పీఎఫ్ ఏఎస్ఐ శివనారాయణ సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాలను తనిఖీలు నిర్వహించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన నూరుద్దీన్ గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించారు. విశాఖ మీదుగా హౌరాకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సుమారు రూ.1.20 లక్షల విలువైన 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.